# సంపాదకుని సన్నిధిలో నన్నయ

'తాతాచార్య'

"బాయ్! ఎవరో చూడరా, వెలుపల నిలబడి ఉన్నది."

"చిత్తం చాలసేపటినుంచి కాచుకొని ఉన్నాడండీ. ఎవరో పాతకాలపు చాదస్తుడుగా కనిపిస్తున్నాడండీ. రమ్మంటారా లోపలికి?"

"రమ్మను. వచ్చిన ప్రతివాణ్ణీ ఏదో విధంగా డిస్పోజాఫ్ చేయక తప్పదుకదా!"

..............................

"ఎవరండీ మీరు? చెప్పండి త్వరగా. అవతల చాలా పని ఉంది"

"........................అవిరళ
జపహోమతత్పరు విపులశబ్ద
శాసను సంహితాభ్యాసు బ్రహ్మాండాది
నానాపురాణవిజ్ఞాననిరతు
పాత్రు నాపస్తంబసూత్రు ముద్గలగోత్ర
జాతు సద్వినుతావదాత చరితు
లోకజ్ఞు నుభయభాషాకావ్యరచనాభి
శోభితు సత్ప్రతిభాభియోగ్యు..."

"ఇదంతా ఎందుకండీ సోదె! మా బాయ్ చెప్పినట్లు నిజంగానే మూడో హస్తం బాగా ముదిరినట్టే ఉందే?"

"నిత్యసత్యవచను మత్యనురాధిపా
చార్యు సుజను నన్నపార్యు......"

"పేరడిగితే పద్యమేమిటండీ? అవతల కట్టించవలసిన పేజీలు చాలా ఉన్నాయి."

"..........నన్నపార్యు..."

"ఓహో అదా? మీరు నన్నయగారా? నన్నయా ది ఫస్ట్ ట్రాన్స్‌లేటర్ ఆఫ్ ఆంధ్ర, ఫస్ట్ ట్రాన్స్‌లేటర్ ఆఫ్ మహాభారత ఇన్ ది యూనివర్స్. కట్టూబొట్టూ అంతా ఆర్థడాక్స్‌గా ఉంటే, అనుకున్నాను అలాంటివాడే అయి ఉంటాడని. అనుకున్నట్టే జరిగింది. నా అంచనా ఏదీ ఇంతదాకా పొల్లుపోలా. ఎన్నికలలో ఎన్ని సూక్ష్మ ప్పరొటాం. సెంట్ పర్సెంట్ సక్సెస్...ఇంతకూ తమరాకకు కారణ మేమిటి? ఊరకరారు మహాత్ములు."

"తొల్లి సకలభువనాత్మకుణ్ణప్రశిసులై యాద్యులైన హరిహరహిరణ్యగర్భ పద్మనాభ వాణీపతి ప్రసాదసమాసాదిత సత్కృప్రవర్ధమాన మహామహీ రాజ్య విభవుండును నిజభుజవిక్రమ విజితారాతిరాజ నివహుండును సకలజగజ్జేగీయమాన నానాగుణరత్నాకరుండునై పరగుచున్న రాజరాజనరేంద్రుండు అఖిలజలధి వేలావలయిత వసుమతీ వనితా విభూషణంబైన వేగీదేశంబునకు నాయకరత్నంబు నుంబోని రాజమహేంద్రపురంబునందు మహేంద్ర మహిమతో బ్రహ్మానందంబున ననవరతమహామహీరాజ్య సుఖంబు లనుభవించుచు సకల భువనశ్రీకి విలాస నివాసంబయిన రమ్యహర్మ్యతలంబున మంత్రి పురోహిత సేనాపతి దండనాయక దౌవారిక మహాప్రధాన సామంత విలాసినీ పరివృతుండయి యనేకశాస్త్రపారగులైన వైయాకరణులును భారత రామాయణాద్యనేక పురాణ ప్రవీణులైన పౌరాణికులును మృదుమధుర రసభావ భాసుర నవార్థవచనరచనా విశారదులయిన మహాకవులును వివిధ తర్క విగాహిత సమస్తశాస్త్ర సాగరపారగులును ప్రతిభులైన తార్కికులును వైణిక గాయకులును వాద్యగా గలుగు విద్వజ్జనంబులు పరివేష్టించి కొలువ విద్యా విలాసగోష్ఠి సుఖోపవిష్టుండయి యుపకథా వినోదంబుల నుండి యొక్కనాడు..."

"అబ్బబ్బ! ఆ రాజమండ్రి జమీందారుగారి సంగతి ఇప్పుడెందుకండీ! ఇది ప్రజాస్వామ్య యుగం మహానుభావా! రాజస్వామ్యపు మీ కాలం కాలధర్మం చెందింది. చెప్పేదేదో కుదుముక్కల్లో చెప్పండి. ప్రత్యేక సంచిక-ప్రధాని జన్మదిన సంచికకు ప్లాను వేయవలసి ఉంది."

# సంపాదకుని సన్నిధిలో నన్నయ

"...నా హృదయంబున నవరతంబును శ్రీ మహాభారతమునందలి యభిప్రాయంబు వినఁ దలఁచి యుండు

అమల సువర్ణ శృంగ ఖుర
మై కపిలంబగు గోశతంబు ను
త్తమ బహు వేద విప్రులకు
దానము సేసిన తత్ఫలంబు త
థ్యము వినుకూరు భారత క
థా శ్రవణాభిరతిన్ మదీయ చి
త్తము ననిశంబు భారత క
థా శ్రవణ ప్రవణంబ కావునన్.

జననుత కృష్ణద్వైపా
యనముని వృషభాభిహిత మహాభారత బ
ద్ధనిరూపితార్థ మేర్పడ
దెనుగున రచియించు మధిక ధీయు_మెయిన్.

అని యానతిచ్చిన విని యేను,

అమలిన తారకాపథమ
యంబుల దెన్నను సర్వ వేద శా
స్త్రముల యశేష పాఠము ము
దంబున బొందను బుద్ధి బాహు వి
క్రమమున దుర్గియూర్థి జల
గౌరవ భారతభారతీ సము
ద్రము నతిశయంగ నీదను వి
ధాతృనకైనను వేంబోలు నే?

అయినను దేవా నీ యనుమతంబున విగ్వజనంబుల యనుగ్రహంబునం జేసి నా నేర్చువిధంబున నిక్కావ్యంబు రచియించెదనని తొడంగి అంకితంబుగా మహాభారత సంహితా రచనబంధురుండ నైతి—నంత కొండొక కాలంబున ఆ రాజమహేంద్రుండు వికట జీర్ణుండైన దద్దయు దుఃఖించి నే నేకత మెట్టలుండుదు మహీపతి తోడన పోగునని పరలోకమున కరిగితి నట......"

"ఉస్! ప్రాణం విసిగెత్తిస్తున్నారండీ నన్నయ్యగారూ! ఈ పాత పురాణమంతా ఎందుకు ఏకరువు పెట్టడం ఛట్రాకులాగ. కొగల కార్యమేమిటి.— తొందరగా సెలవిప్పండి. కలర్ ఎప్వర్ టైజుమెంటు కూడా ఉంటట. పేపరు అరగంట ముందుగా వెళ్లాలి. చప్పున ముగించండి."

"విమలాదిత్య తనూజుడు
విమల విచారుడు కుమారవిద్యాధను డు
త్తమ చాళుక్యుడు విజయా
గమ విహితశ్రీముఖుడు తుహినకరకులకాంతిన్.

మహాభారత సంహితారచనము నిఖిలలోక హితార్థంబుగా దత్తావధానుండవై పూర్తిసేయుమని వెండియు నానతిచ్చిన మానుగ నిద్ధరన్..."

"మానుగ ఏమిటండీ మానుగ; పీనుగలాగ! పూర్తి చేయడానికి పూనుకున్నారన్నమాట. ఆర్యా, ఎందుకీ శ్రమ? ఇది వ్యావహారిక భాషాయుగం. మీ గ్రాంథిక రచనను, అందులోను భారతాన్ని ఎవరండీ చూస్తారు? ఇంతకూ మాది వ్యావహారికం పాలిసీ, క్రీడ్ను. కనుక, అలాటి రచనలను ప్రోత్సహించటంలేదు. సరే గాని, శాకుంతలం, కాదంబరి మున్నగు రసగుళికలవంటి రచనలుండగా, మీరు ఫస్టు అనువాదానికి భారతం ఎలా ఏరుకున్నారండీ? ఆశ్చర్యంగా ఉంది. గటే అంతటివాడు శాకుంతలం చదివి గంతు వేశాడు కదా! మీకు హృదయం స్పందించలేదటండీ? అయ్యో! జాతీయత లేదు! వాట్ ఎ ఫాల్ మై కంట్రీమెన్!"

"అక్కథయ యభిమతంబైన కారణంబు సెప్పెద దత్తావధానులరై వినుండు.

ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని
యధ్యాత్మవిదులు వేదాంతమనియు
నీతివిచక్షణుల్ నీతిశాస్త్రంబని
కవివృషభులు మహాకావ్యమనియు
లాక్షణికులు సర్వలక్ష్య సంగ్రహమని
యైతిహాసికు లితిహాసమనియు
బరమపౌరాణికుల్ బహుపురాణసముచ్చ
యంబని మహిఁ గొనియాడుచుండ
వివిధ వేదతత్త్వవేది వేదవ్యాసు
డాదిముని పరాశరాత్మజుండు
విష్ణుసన్నిభుండు విశ్వజనీనమై
పరగుచుండఁ జేసె భారతంబు."

"భారతం! మహాభారతం! వేదమే ట్రాష్! ఒన్ పర్సెంట్ సెన్స్. అలాంటప్పుడు భారతమేమిటండీ వేదసారం? ఉపన్ను ఉపస్సు అని మహా ఇదిగా అంటారు? టాగోర్ కంటే బాగా చెప్పాడా వేదిక్ రైటర్? "ఉషా గబీర్ ఛబి భాలో భాలో...ఆహా!"

"టాగోర్ అను కవీంద్రుండు..."

"బాగోతే తేలేదటండీ? విశ్వకవి. నోబుల్ ప్రైజు కూడా వచ్చింది. ఇంతమాత్రం చరిత్ర తెలియకపోతే మీ పాండిత్య మేమిటండీ?"

"కొండొక..."

"అబ్బ! ఇది భరించలేనండి. మా మాస్టారుగారిలా 'హా హా చాప వేయుము. మరువా మంగినీ రందిమ్ము' - అని పల్లాపంలోను గ్రాంథికం ఎందుకండీ? దానిని మేము ఎక్కకేజినేగుడం లేదని ఇదివరకే హెచ్చరించానుగదా! ఇటీజ్ డెడ్! లెట్ ది ఓల్డ్ ఆర్కియాయిక్ పాక్సిస్క్రిప్ట్. నో యూజ్ ఆఫ్ కార్ప్సీయూసీ. కనుక వాటితో విమాత్రం అవసరం ఉన్నా వ్యవహారికంలోనే మాట్లాడండి. సంతోషిస్తాను."

"ఇదియేం దొల్లి వ్యవహృతంబ..."

"అదే వద్దన్నాను. నో అర్గుమెంట్ — అంటే వితండవాదం — వద్దు. మీరు విపుల కవి శాసనులు గదా. మా భాషలోనే మాట్లాడండి. మీరు ఈ భారతానువాదం మా తలపై రుద్దబోకూడదు. చిన్నప్పటినుంచీ కూడా స్వతంత్ర కల్పనకి అవకాశం లేకపోయింది. కలాబ్ధంకింద దొరలు వచ్చారు; కొత్త పోకడలు. కొత్త పోకడలు పారతంత్ర్యంలో వచ్చాయి కాని, లేకపోతే వింతవనీగుగా, స్టాగ్నెంట్‌గా ఉండిపోయేది కాదటండీ తెలుగు? సరే కాని. వ్యాసులు, వ్యాసులు అంటున్నారే? వ్యాసులెందరో తెలుసా మీకు? నాగరుసులాగా ముగ్గురట. పురాణాలు కాపీ చేసినవాడూ, సూత్రాలు క్రోడీకరించినవాడూ, భారతం — అన్‌సైంటిఫిక్ ప్రిమిటివ్ హిస్టరీ చెప్పినవాడూ అని. మరి మీరు..."

"ముగ్గురూ ఒక్కరే నాయనా?"

"ఆ! అదే అన్నాను, పిడివాదం మీదని. భటారకా! గేపర! ఒక్క మానవజీవితంలో ఇంత పనీ సాధ్యం ఎలాగూ కాదు గనుక పాశ్చాత్యులు ఎంతో శాస్త్రీయ దృక్పథంతో ముగ్గురని నిర్ణయించారు. కాళిదాసులు కూడా ముగ్గురట తెలుసా?"

"ఆఁ! ఆఁ!"

"మరేమనుకున్నారు రీసెర్చి — పరిశోధన అంటే, గంటం పట్టుకొని భారతం — ఏదో అనాధ — రెన్డ్ కాపీ పట్టుకొని అనువాదం చేస్తూ పోవడం కాదు. నానా గ్రంథాలూ చూడాలి. నానా కోశాలూ వెదకాలి కోశివానాచార్యః — అన్నారు."

"కాళిదా..."

"వద్దు. వద్దు. నాటకాలు మూడూ వ్రాసిన కాళిదాసు ఒక్కడు; కావ్యాలు వ్రాసినవాడొక్కడు; తక్కిన చిల్లర మల్లర రచయిత ఒక్కడు: — వరపి మురుకి. కాళిదాసంటే జ్ఞాపకం వచ్చింది. మీరు కాళిదాసును కాపీ కొట్టారని, కొటేషను లైనా పెట్టకుండా పదాలు సంగ్రహించుకున్నారని కొందరు పరిశోధకులు అన్నారు. ఎందుకండీ మీకూ ఇలాటి బుద్ధులు?"

"ఏది చెప్పు నాయనా?"

"ఏను గుర్వర్థ మర్థినై యాన వేళ
కడగి వచ్చితి విప్రుడ నీకడకు వేడ్క-
దండితాంగ తీ నీదేవి కుండలమ్ము
లిమ్ము నాపూనిక యిది సఫలమ్ముగాగ.

అనే పద్యంలోని 'గుర్వర్థ మర్థినై' అనే మాటలను కాళిదాసుగారి రఘువంశంలోని 'గుర్వర్థ మర్థీ శ్రుతపారదృశ్వా' అనే శ్లోకంనుంచి కొటేశారటగా. మరొకటి కూడా అన్నారండీ దీపంనుండి ఏదో దీపం పుట్టింది అనే భావం కూడా తస్కరించారు మీరని...

"అదా నాయనా?
నీ పుణ్య తనువు వలనను
యీ పుత్రకు డుద్భవిల్లి యెంతయు నొప్పెన్
దీపంబువలన నొండొక
దీపము పుట్టించినట్లు తేజం బెసగన్.
అనే కంద మనుకుంటాను."

"అదేనండీ, అదే. 'ప్రవరీతో దీప ఇవ ప్రదీపాత్' అనే కాళిదాసుగారి మాటకు మక్కికిమక్కి అనువాదమే అటగా! అలాంటప్పుడు కాళిదాసు కావ్యాలే అనువదించి ఉంటే పోయేద?"

"గ్రంథచౌర్య మనేది ఏముంది నాయనా? గౌరవంకొద్దీ ప్రాచీనులనుంచి ఎన్నో గ్రహిస్తాము; ప్రయోగిస్తాము."

"బాగా ఉందండీ వరస! ఈ కాలంలో కాపీ రైట్ అనేది చట్టం. దానిని ఉల్లంఘిస్తే మర్యాద దక్కదు."

"అమర్యాద ఏమీ లేదు నాయనా గౌరవంతో గ్రహించినప్పుడు."

"అదలా ఉండనివ్వండి. మీరు సత్యం గురించి అంతగా వర్ణించారు గదా!

నుతజల పూరితంబులగు
నూతులు నూఱిటికంటె నూనృత
వ్రతి, యొక బావిమేలు మఱి
బావులు నూఱిటికంటె నొక్క స
త్క్రతువది మేలు తత్క్రతుశ
తంబుల కంటె సుతుండు మేలు త
త్సుత శతకంబుకంటె నొక
సూనృత వాక్యము మేలు సూడఁగన్.

అని మహా గట్టిగా చెప్పారు కదా! నిజం పలకండి మీరు. వేములవాడ భీమకవి జైనభారతం చింపించి కాల్పేశారటగా?"

"నేనా నాయనా?"

"ఔను మీరే. మీరే యూనాది జెలస్-జెలస్.."

"అంత అవసరమేమిటి నాకు?"

"అవసరమా? కీర్తిదాహం. మొదటి కావ్యం రచించినవాడు అవుదామనే ఆరాటం..."

"ఇంతకూ ఆ భీమకవి ఎవరు నాయనా? నా కాలంలో ఎవరూ అలాటివారు లేరే? భీమ ప్రెగడ ఉండేవాడు. కాని కవి ఎవరూ లేరే? తెలుగులో కావ్యమన్నదికూడా లేదే? కన్నడంలో ఉండేది జైన ఫక్కీలో వ్రాసిన కావ్యం. నా నెచ్చెలి నారాయణ భట్టు చదివి వినిపించాడు. నారాయణభట్టు ఎలాటివాడనుకున్నావు?

"పాయక పాకశాసనికి
భారత ఘోర రణంబునందు నా
రాయణునట్లు దానును ధ
రామగవంశ విభూషణుండు నా
రాయణభట్టు వాఙ్మయ ధు
రంధరుఁడుం దనకిష్టుఁడున్ సహా
ధ్యాయుఁడు నైన నాఁడభిమ
తంబుగఁ దోడయి నిర్వహింపఁగన్.

భారతం మొదలుపెట్టాను."

"చచ్చినవానికండ్లు చారడేసి అంటారు లెండి ఆయన వ్రాసిన రచనేదీ లేదుగాని, మహాయిదిగా పొగడుతున్నారు. ప్రసంగం మార్చివేసే చాతుర్యం చాలా ఉంది. ఇంతకూ భీమునను మీరు ఎరుగరంటారా?"

"లేదు నాయనా! నాకు తెలిసిన భీమునను తెలియజేశాను. అంతకు..."

"మరి మా సాహిత్య చరిత్రకారులందరూ అలా అన్నారేమిటండీ మరి? వారిమాట నెలా తోసివేయడం? మీరే లయర్ అయి ఉంటారు. రాజాస్థానాలలోని వారిని నమ్మరాదు తమ పేరూ ప్రతిష్ఠా పాడవుతుందని మహాయిదిగా, లౌక్యంగా ఇతరులను ధ్వంసం చేస్తారు. అయాం సారీ మీ మాటను ఎలాగూ నమ్మలేను గనుక... ఆ మరిచాను అదేమిటి మీ అనువాదం సరిగా లేదంటారే చాలామంది? వ్యాస భారతాన్ని మీ ఇష్టం వచ్చినట్టు సంకోచ వ్యాకోచాలు చేశారట. అనువాదకుని పనికాదండీ అది. అది ఎడిటర్స్ డ్యూటీ, ఎడిటర్ ఏమిచేసినా చెయ్యవచ్చు ప్రజాహితంకోసం."

"నేనుకూడ జగద్ధితం కోసమే నాయనా అలా చేశాను."

"మీ ఇన్టెన్షన్ మంచిదే కావచ్చు. కాని; క్రియ జరిగింది ప్రతికూలం. ప్రతి ప్రాణీ నిర్వాణం పొందడానికి బుద్ధ భగవానుడు పంచ శీలాలు ఉపదేశించి త్రిరత్నాలు అందించి పోయాడు కదా! మీ కేంటండీ మరల వైదిక ధర్మమనే సాకుతో ఆ గ్రేడెడ్ వర్ణాశ్రమ ధర్మాలను పాతుదామనే వాళ్లు! వారి చాందస్తాలు మా పై గుడి సమూహాన్ని ధ్వంసం చేశారుగదా! ఒక వైపేమో సంఘం ధ్వంసం చేశారు; మరొక వైపేమో సంఘంలోని వ్యక్తుల క్రియేటివ్ టాలెంటును ధ్వంసం చేశారు—అనువాదంతో. ఇంకొకవైపు భేదోపాయం, కులంబ కలహం—అబ్బ! అబ్బ! ఎంత దుర్గతి తెచ్చారండీ జాతికి—"

"అయ్యో నాయనా!......"

"నో ఆర్గ్యుమెంట్ ప్లీజ్.. మరొకటి అడుగుదామనుకున్నాను. ఎందుకండీ మీకు పాత మాగాయల మాటలమీద, మత చాదస్తాలు తెలిపే మాటలమీద మోజు? చక్కగా వ్రాయరాదూ?"

"ఏమిటా పదాలు నాయనా?"

"బ్రాహ్మణార్థము—అంటే ఏమిటండీ తద్దినం కదూ? మీరు అలాటి అశ్లీలార్థక పదాలు వాడవచ్చా?"

"ఎక్కడ..."

"ఎక్కడేమిటి? మీరు వ్రాసింది మీకే జ్ఞాపకం ఉండడంలేదూ? బకాసురవధకు భీమసేనుడు వెళ్లే

సమయంలో...ధ్వంసన్ను ఉత్సాహాన్ని చూపించడానికి మంచిదే—తిరశం—వాడారనుకోండి. దట్ ఇజ్ ఎ వెహికల్ టు ఎన్ ఐడియా. మైనర్ థింగ్.

పలు దెఱంగుల పిండి వంటలు
బప్పగూడును నేతి కుం
డలు గుడంబు దధి ప్రపూర్ణ ఘ
టంబులుం గొని వచ్చి యా
వలఘు సత్త్వుడు మారుతాత్మజు
డన్నిటన్ గతి ఖేగుడై
బలముగల్గి కడంగి ఎప్పుడు
బ్రాహ్మణార్థము సేయగాన్.

రన్నింగురేసులో చక్కగా, మహావడిగా పరిగెత్తివచ్చి ఫినిషింగులైను తాకబోయి వెనుక్కి విరుచుకుని పడినట్టు లేదూ ఆఖరున బ్రాహ్మణార్థము సేయగాన్-అనేమాట?"

"బ్రాహ్మణార్థము అనే మాటకు శ్రాద్ధం అనే అర్థం ఎక్కడిది నాయనా? బ్రాహ్మణ ప్రయోజనం, బ్రాహ్మణకార్యం అని అర్థం. శ్రాద్ధనిమంత్రణం అనే అర్థం లేదే?"

"మరి శబ్దరత్నాకరంలో శ్రీ సీతారామాచార్యులు గారలా ఇచ్చారు? మీ అంతమాత్రం తెలీదా?"

"సీతారామాచార్యులెవరు నాయనా?"

"ఆ! ఏమన్నారు? బ్రహ్మాండమైన తెలుగు నిఘంటువు వ్రాసిన ఆచార్యులవారే మీకు తెలీదా? సరే! మీతో వాదించి ప్రయోజనం లేదు. అన్నట్టు మరచాను. ఆమహాకవి ఎవరో అన్నట్టు మరీ పాతబడ్డ మాటలంటే మీకు మరీ మోజెందుకండీ? అరుణవారి-అని వాడారు కదా!

దారుణ జానుదండమున
దండధర ప్రతిముండు భీకరా
కారుడు వానివీపు విఱు
గంబొడిచెం బిశితంబుతో నవ
ద్వారములన్ మహారుధిర
ధారలు బోవ నొక్క మాంస పుం
జారుణవారి ఘోరనదు
లై పఱవన్ విపినాంతరంబునన్.

ఏ శబ్దకోశంలో ఉందండీ ఈపదం? అరుణ వారి అంటే ఎర్ర నీరు కదా. ఏదో సాదృశ్యంగా వచ్చిందంటే నమ్మదాము రక్తము అనే అర్థం. దాన్ని మీరు కావ్యంలోకి—ఐ మీన్ మీ అనువాదంలోకి ఎక్కించుకోవచ్చా?"

"అప్పటికి రూఢిలో ఉంది నాయనా?"

"ఎక్కడుందండీ! మరొక పదమూ ఇలాటిదే వందనం అనేది.

పరిశతమాల తాల హరి
చందన చంపక నారికేళ కే
సరి కదలీ లవంగ పన
స క్రముకార్జున కేతకీలతా
గరు ఘనసార సాల సహ
కార మహీరుహ రాజరాజిసుం
దర నందన వాటికల
దత్పుర బాహ్యము లొప్పు జూపగన్.

నందన మని ప్రతి చీకిరి బాకిరి తోటకూ పేరు పెడితే ఇంద్రుణ్ణి, అతని సుందర నందన వనాన్ని ఇన్‌సల్ట్ చేసినట్టు కదా?"

"నందన......"

"ఆగండి. మరొక తమాషా పదం ఉంది! రచియించు. ఏమిటండీ మీ జేస్ట్? రచన అనే అందమైన పదాన్ని కవితకో, శిల్పానికో, మరొక లలితకళకో వాడితే బాగుంటుంది కాని

ఇమ్ముగ విశ్వకర్మ రచి
యించిన కాంచన హర్మ్యతుంగ శృం
గమ్ముల రశ్మిరేఖలు ప్ర
కాశములై కడు బర్వి తన్మయా
పమ్మిన బాలుమన్న ఘన
పంకులఖండ చిరద్యుతి ప్రతా
నమ్ముల శ్రేణి సేయుచు న
వారతమున్ విలసిల్లు దత్పురిన్.

అనీ,

విమల మణిమయములగు దూ
లములం గంబముల గోడలను వేదుల కు
ట్టిమముల జాటిన ప్రాకా
రములను గర మొప్పచుండ రచియించె సభన్.

అని గోడలు కట్టడానికీ, మురుగు కాలువలు తవ్వడానికి ఈ పదం వాడితే ఏం బాగుంటుంది?"

"రచన అవడానికి చేయడం అని సామాన్యార్థం నాయనా! కనుక నా ప్రయోగం...."

"సాధువు; ఉచితం అంటారు కదూ? మరీ వింతమాట దారక్రియా. దారక్రియ అంటే పెండ్లి అని ఎవరండీ చెప్పింది? ఏ విధంగా అతుకుతుం దండీ పెళ్లాం+పని అని?"

"కాళిదాసు ప్రయోగించాడు. నాయనా 'దారక్రియా యోగ్య దశంచ పుత్రం ప్రస్థాపయామాస ససైన్యమేకం' అని రఘువంశంలో."

"ఔనౌను. మీకు అవసరమైతే పైవారు ప్రయోగించారంటారు; వారి పేరు చెబుతారు. లేనప్పుడు మానివేసారు చెప్పకుండానే. పద్యంకూడా ఏమి గడబిడగా నడిపారండీ.

చనబెడికి దారక్రియ
యును జెంటికి మధురగీతయును జీకున క
త్యనుపమ సురూపదర్శన
మును జేయుట బోలు గృష్ణ బూజింమ టెలక్."

అని...ఆఁ! సమయానికి బాగా జ్ఞాపకం వచ్చింది. మీ వెన్నెల పద్యం తెగపొగడుతా రందరూ, ఏదీ చదవండి."

"ఏది నాయనా?"

"అదేనండీ. శారద రాత్రులు అని ఆరంభమౌతుంది."

"శారదరాత్రు లుజ్జ్వలల
సత్తర తారకహార పంక్తులం
జారుతరంబులయ్యె విక
సన్నవ కైరవగంధ బంధురో
దార సమీర సౌరభము
దాల్చి సుధాంశు వికీర్యమాణ క
ర్పూర పరాగ పాండురుచి
పూరములం బరిపూరితంబులై"

"హ్వా! మూన్ లైట్. ఎంత మధురమైంది; ముచ్చటైంది. అలాటి రమణీయభావం ప్రకటించడానికి ఈ కొండవీటి చేంతాడువంటి, అజగరాలవంటి సమాసాలేమిటి? చిన్న చిన్న మల్లెపూవు రేకులలా ఎంత అందంగా చెప్పవచ్చునండీ. పాడుచేశారు. మా శిష్టా ఎంత ముక్తసరిగా ముత్తేలసరంగా చెప్పాడో చూడండి వెన్నెలను గురించి:

'అటు వెన్నెల
ఇటు వెన్నెల
ఎటు జూచిన సిరివెన్నెల'

ఎంతహాయిగా ఉందండీ! వెన్నెలను ముక్కలు ముక్కలుచేసి విరుచుకొని తిన్నట్టు లేదూ? అమ్మయ్య! ఎంత సంతోషం! ఎంత చలవ!"

"శరచ్చంద్రిక—అలాంటి..."

"అబ్బ శరత్ చంద్రిక అనండి సార్. శరత్ చంద్రిక. శరచ్చంద్రిక అని వికారంగా పచ్చిపులుసు, పిచ్చికుక్కలాగ లేదూ?"

"నాయనా శాఖాచంక్రమణంగా చాలదూరం వచ్చాము."

"ఔనౌను. ఏదో అనువాదం చేశారు సరిపోయింది. మీ ఆగమన కారణంబు సెలవిచ్చారు కారు."

"అదే భారతం అప్పుడు ఆగిపోయింది. ఇప్పుడు మరీ ముగించడానికి రాజరాజ నరేంద్రులవారు ఆనతిచ్చారు. దానికి లోకంలో ప్రచారం కావాలి. ప్రచారం చేయవలసిందని నారదులవారిని ప్రాధేయపడాను. వారేమని సెలవిచ్చారంటే—మా కాలం చెల్లిపోయింది. పూర్వమంటే ఏవో రాజసభలకు తంబూర మీటుతూ వెళ్ళి నానా విషయాలూ చేరవేసేవాడిని. ఇప్పుడు ఆ రాజులూ లేరు. ఆ ఆస్థానాలూ లేవు. వాటిస్థానంలో పత్రికలనే కొత్త 'నారదీయాలు' వచ్చాయి. వాటినోళ్ళలో పడితే ఏకకాలంలోనే కోటాన కోటిమందికి విషయాలు తెలుస్తాయి-అన్నారు. కనుక దేవేంద్ర సార్వభౌములవారి ఆదేశంపై భూలోకానికివచ్చి మీ కార్యాలయాన్ని......"

"పావనం చేశారు. చాల సంతోషం. కాని, మహానుభావా, మేము పాతకథలను ప్రోత్సహించడం లేదు. అందులోను పాతవ్యవస్థలను సమర్థించే ఏ లిటరేచరుకూ దోహదమివ్వడంలేదు. పాత పలుకుబళ్ళు కూడా మాకు పసందుకావు. మీరు దేవేంద్ర సార్వభౌములవారు—అనగానే నా ఒంటిపెన జ్వరాలు పాకినట్టయింది. సార్వభౌముల వారేమిటి? నవారు! చీటికి మాటికి కాలికి బుద్ధిచెప్పేవాడూ ఒక మొనగాడే. ఇప్పుడు రాజులకు, జమీందారులకు పేర్లతర్వాత వారు అనేగౌరవం తగిలించే కాలంపోయింది. రాజా దేవేంద్రుడుగారు అనండి. మరి ప్రచారమన్నారే? ఎలాటి

ప్రచారం? మీరు వ్రాసే చాదస్తమంతా పత్రికలో వేయాలా ఏమిటి కొంపతీసి? అది ససేమిరా సాధ్యం కాదు......"

"అదేమీ అక్కరలేదు నాయనా? దీనిలో జరిగిన వార్తలు ప్రచారంచేసే చాలు."

"ఏమి జరిగిందేమిటి?"

"ఇదిగో ఈ కల్పకపత్రంలో లిఖించుకొని వచ్చినాను. చూడు నాయనా?"

"ఇదేమి భాషండోయ్? అంతుపట్టడం లేదు."

"తెలుగే నాయనా! లిపికూడ తెలుగులిపే."

"ఇది తెలుగులిపి అని ఎవరైనా అనేవాడుంటాడా? ఏదో శాసనలిపిగాని."

"శాసనలిపి అనేదేమీ లేదు నాయనా? శాసనాలలో వ్రాయడం, తాటాకులలో వ్రాయడం ఒకే లిపే."

"నన్నయగారూ, ఇక ఊరుకోండి. మా కళ్ళే నన్ను మోసం చేస్తాయంటారా? ఇది శాసన లిపి కాక మరేమిటి? దానిలో ఏమిటుందో మీరే చదివి చెప్పండి. ప్రకటన యోగ్యమైతే సంగ్రహంగా ప్రకటిస్తాము."

"విను నాయనా. శచీపతి యొక్క నాడు పారిజాత తిరునాల..."

"హతోస్మి. మరీ అదేభాష. మీకు కుదరదు. నేను కొన్ని ప్రశ్నలు వేస్తాను, సమాధానం చెప్పండి. విషయం వ్రాసుకుంటాను. సభ ఎక్కడ జరిగింది?"

"పారిజాత తరుచ్ఛాయను."

"అబ్బ; పొయెట్రి ఎందుకండీ న్యూసులో. మేము వ్రాసేది వార్తలేగాని మహాకావ్యం కాదు గదా!"

"ఎవరు అధ్యక్షత వహించారు?

"వృద్ధశ్రవసుడు"

---


నాట్యమాల ప్రచురణము - 1 ఇప్పుడే వెలువడినది!

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాదరమున ప్రకాశితము

నాట్యశాస్త్రము (భరతముని ప్రణీతము)

ఆంధ్రానువాదము:

[సప్తభావ ప్రకాశికా సహితము]

శ్రీ పోణంగి శ్రీరామ అప్పారావు ఎమ్. ఏ.

36 అధ్యాయములు — 1000 పుటలు.

రాయల్ సైజు - కాలికో బైండింగు - వెల రు 20/-

ప్రముఖుల ప్రశంసల నందుకొన్న సమగ్ర సచిత్ర-సరళానువాదము! వివరణాత్మకములైన అధస్సూచికలు, ప్రతి అధ్యాయము చివర విపులముగా విశేషాంశములు కలవు!! ఇది నాట్యకళోపాసకుల పాలిటి విజ్ఞాన సర్వస్వము!!!

ప్రతులకు:

డా॥ పి. సాంబశివరావు,
306—307 సిమ్‌కార బాక్సు,
చిక్కడపల్లి, హైదరాబాదు.

పోణంగి సత్యనారాయణశాస్త్రి,
C/o లాండ్ మార్ట్‌గేజ్ బ్యాంకు,
కొవ్వూరు. (ప. గో. జిల్లా).

# సంపాదకుని సన్నిధిలో నన్నయ

"వృద్ధశ్రవుడు, గృధ్రప్రియుడు ఎవరండీ బాబూ?"

"శచీపతి అయిన ఇంద్రుడు నాయనా?"

"మామూలుగా ఇంద్రుడంటే పోదండీ? వృద్ధశ్రవుడని అనడం ఎందుకండీ? ప్రజాసామాన్యం తెలుసుకోవాలనే దానికంటే పాండిత్యప్రకర్ష తెలుపడమే మీ పాత్రి పండిట్స్ ఉద్దేశంగా కనిపిస్తుంది. అది ఉండనివ్వండి. ఏం జరిగింది సభలో?"

"భారత రచనకు మరల చేసి ఉద్యుక్తులు కావాలని రాజరాజ నరేంద్రులవారు కోరారు. దానికి అందరూ హర్షించారు."

"ఇంతేనా? ఇంకేమైనా విందులూ, వినోదప్రదర్శనాలు, నృత్యాలు జరగలేదూ?"

"విందులూ ఎందు........."

"ఎందుకేమిటి లెండి? అలా జరగాలి. అప్పుడు గాని సభ కాదు. అందరూ అప్సరసలు ఉండగా నాట్యం జరక్కపోవడం సంభవమా? జరిగే ఉంటుంది మీరు ఏ లోకంలో ఉన్నారో!...సరే. మా సీనియర్ సబ్ ఎడిటర్ దగ్గర కూర్చోండి. అవసరమైతే మరికొన్ని వివరాలు నోట్ చేయమని చెబుతాను... ఇదిగో! ఏమండీ! ఆయన ఏమో చెబుతారు నోటుచేసుకొని వార్తగా వ్రాయండి. మొన్న మకరసంక్రాంతి పండుగనాడు స్వర్గంలో శ్రీ దేవేంద్రుడు ఆధ్వర్యాన సభ జరిగింది. రాజమహేంద్రవరం మాజీ రాజా రాజరాజనరేంద్రుడు గారు ఆ సందర్భంలో భారతం అనువాదం పూర్తి చేయవలసిందిగా తమ మాజీ ఆస్థానకవి శ్రీ నన్నయ గారిని కోరారు. అందుకు అందరూ హర్షం ప్రకటించారు. శ్రీ నన్నయ గారు అంగీకరించారు. సమావేశం శ్రీ నారదుని వీణా వాదనంతో ప్రారంభమైంది. శ్రీ నారాయణభట్టు ధన్యవాదాలు సమర్పించాడు. మేనకా తిలోత్తముల నాట్యంతో సమావేశం సమాప్తమైంది...అని టూకీగా వ్రాయండి. దేవేంద్రునికి నారాయణభట్టుకి శ్రీ చాలు. ఆంధ్రేతరులు గనుక గారు వద్దు. రాజరాజ నరేంద్రునికి నన్నయకు శ్రీ గారు రెండూ పెట్టండి... నన్నయగారూ, ఇంతకంటే మీకు ఎక్కువ స్పేసు ఇవ్వలేమండి. మా సగారి రెగు సంచిక, కార్తీక ప్రత్యేక సంచిక వేయవలసి ఉంది. కనక ఇంతమాత్రం సరిపెడుతూన్నా. మీరు మరో ప్రాచీన కావ్యమేదైనా అనువాదం చేసి ఉంటే స్పెషల్ ఆర్టికల్ వ్రాయించి ఆదివారం ప్రత్యేకంగా వేయించేవాడిని. మీరు అలా చేయలా. సంపాదకీయం కూడా వ్రాసేవాణ్ని. మీరు అలాటి చక్కని చాన్సు పోగొట్టుకొన్నారు. ఇక మీరు వెళ్ళవచ్చు. అవతల నా కోసం మంత్రులూ, ప్రధాన మంత్రులూ కాచుకూర్చున్నారు. భారతం వార్త-ఐమీన్ అనువాదం వార్తకోసం నా టైమును వేస్ట్ చేయలేను...మరోమాట. ఈ వార్త వెంటనే పడుతుందని మీరూ, ఇంద్రుడూ వేయికండ్లతో వేచి ఉండకండి. విదానంగా పడుతుంది ... ఒరేబాయ్ ఈయనకు దారిచూపరా."

"వెళ్లుతున్నాను నాయనా!

రాజకులైక భూషణుడు
    రాజమనోహరు డన్యరాజతే
జోజయశాలి శౌర్యుడు వి
    శుద్ధయశశ్శరదిందు చంద్రికా
రాజితసర్వలోకు డప
    రాజితభూరిభుజాకృపాణ ధా
రాజలశాంతశాత్రవప
    రాగుడు రాజమహేంద్రు డున్నతిన్."